
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 29 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (శనివారం సాయంత్రం)
సహర్ 4:53 (ఆదివారం ఉదయం)

ధాన్యం కొనుగోళ్లకు యాక్షన్‌ప్లాన్

జిల్లాలో వరి సాగు... (ఎకరాల్లో)

మండలం	వరి
గంభీరావుపేట	18,000
ఇల్లంతకుంట	24,000
ముస్తాబాద్	20,000
సిరిసిల్ల	4,800
తంగళ్లపల్లి	19,000
వీర్నపల్లి	9,100
ఎల్లారెడ్డిపేట	16,850
బోయినపల్లి	12,500
చందుర్తి	16,000
కోనరావుపేట	17,800
రుద్రంగి	4,700
వేములవాడ	5,150
వేములవాడ రూరల్	10,450
మొత్తం	1,78,350



జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు (ఫైల్)

- జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో వరిసాగు
- దిగుబడి అంచనా 3.67 లక్షల మెట్రిక్ టన్నులు
- పౌరసరఫరాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- జిల్లాలో 241 కొనుగోలు కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి సాగులో రైతులు నానా కష్టాలు పడుతు న్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు అందక దిగుబడిపై ఆందోళన చెందుతు న్నారు. వరికో తలకు సమయం ఆసన్నమవుతున్న క్రమంలో పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు వడగళ్ల వర్షాలు, తెగుళ్ల పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏప్రిల్ రెండో వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుందని, అందుకు అనుగుణంగా కొనుగోళ్ల చేసే దిశగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో యాసంగిలో 1.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వరిసాగు అనుగు ణంగా దిగుబడిపై పౌర సరఫరాల శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా లుకు ధాన్యం ధర ఏ గ్రేడ్ రూ.2320, బి గ్రేడ్ రూ.2300 చొప్పున కొనుగోలు చేయనున్నారు. ఏప్రిల్ 2వ వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

● ఏప్రిల్‌లో కొనుగోళ్లకు సన్నద్ధం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.78లక్షల ఎకరాల్లో వరి సాగు ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. 2.92 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం, 8 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందులో 67 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయ డానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ రెండవ వారం నుంచి లక్ష మెట్రిక్ టన్నులు, మేలో 1.88లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 79 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనాలు వేశా రు. ఇందులో పౌరసరఫరాల శాఖ ఏప్రిల్‌లో 75 వేలు, మేలో 1.68 లక్షలు, జూన్‌లో 63 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

● జిల్లాలో 241 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా, 241 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీ ద్వారా 172 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 57 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా 6 కేంద్రాలు, మెప్మా ద్వారా 6 కేం ద్రాల ఏర్పాటుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించడానికి గ న్నీ బ్యాగులు కొత్తవి 18.70లక్షలు, ఇప్పటికే ఉపయో గించినవి 15.90 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్ల కోసం టార్పాలిన్లు, ఇన్నోవింగ్ మిషన్లు, పాడీ క్లీనర్లు, మాయిశ్చరైజ్ మీటర్లు, వేయింగ్ మిషన్లు, అస్క్ రిమూవర్స్ వంటి పరికాలు అందుబాటులో ఉంచారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంది స్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవా లని ఐకేపీ డీపీఎం పద్మయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాయలంలో గ్రామైఖ్య సంఘాల మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం పద ్మయ్య మాట్లాడుతూ ప్రతి స్వయం సహాయ సంఘం సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న రు ణాలను తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. రికార్డుల్లో వివరాలను నమోదు చే యాలని అన్నారు. ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం మల్లేశం, మార్కెటింగ్ ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సాధికారిత కేంద్రం నిపుణులు దేవిక అన్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలోని ఆదర్శ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవిక మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని అన్నారు. సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. గుర్తు తెలి యని వ్యక్తులకు తమ ఫొటోలు, వివరాలను పంపించకూడదని సూచించారు. పట్టుదల, ఉన్నత లక్ష్యంతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, 108, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లు, తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాంగ పుస్తకావిష్కరణ..



పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో శుక్ర వారం దూప దీప నైవేద్యం అర్చక సంఘం జిల్లా సంఘం ఆధ్వర్యంలో విశ్వా వాసు నామ పంచాంగ పుస్తకంను సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగ పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా దూప దీప నైవేద్యం అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథి మాట్లాడారు. సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన విశ్వావా సు నామ పంచాంగాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా సంఘం ఆవిష్కరిస్తుందన్నారు. అందులో భాగం రాజన్నసిరిసిల్ల జిల్లాలో పంచాంగ పుస్త కాన్ని ఆవిష్కరించామని తెలిపారు. ప్రజలు విశ్వావాసు నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరంకుశం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బిట్కూరి గోపాలకృష్ణమాచారి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మరింగట్టి కొంమచారి, నాయకులు గొంగల్లా రవికుమార్, చర్లపల్లి సీతారాములు, పంచరత్నాల మురళి తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ, అబార్షన్లు చేయవద్దు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎట్టి పరిస్థితుల్లో లింగనిర్ధారణ, అబార్షన్లు చేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ(గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధి త చట్టం)అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ స్కానింగ్ సెంటర్లలో ఫామ్ ఆడిట్లను ప్రతినెల ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీ లు నిర్వహించాలన్నారు. స్కానింగ్‌సెంటర్లలో ధరలు పట్టికను, ఇతర సర్టిఫికెట్ల ను గోడలపై ప్రదర్శించాలన్నారు. స్కానింగ్‌కు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లు కలగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో పీవోఎంహెచ్‌ఎన్ డాక్టర్ అంజలినాఆల్ఫ్రేడ్, డాక్టర్ శోభారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, లీగల్ అడ్వై జర్ శాంతి కుమార్ శుక్ల, ఎన్జీవో ప్రెసిడెంట్ చింతోజు భాస్కర్, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్‌వో బాలయ్య పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 14 మంది గైర్హాజరు..

సిరిసిల్ల రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో 6,767 మంది విద్యార్థులకు 6,753 మంది విద్యార్థులు హాజరుకాగా, 14మంది విద్యార్థులు గైర్హాజరు అయారు. శుక్రవారం పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్ధన్‌రావు సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

సిరిసిల్ల క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరిసిల్ల జిల్లా కోర్టు అడ్వ కేట్స్(బార్) అసోసియేషన్ అధ్యక్షుడిగా జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా తంగ ళ్లపల్లి వెంకటి ఎన్నికయ్యారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్‌లో భాగంగా సిరిసిల్ల కోర్టులో ఉన్న 181న్యాయవాదుల ఓట్లలో 176 ఓట్లు పోలయ్యాయి. అనంతరం ఓట్లు లెక్కింపు చేపట్టారు. అధ్యక్షుడిగా జె. శ్రీనివాసరా వు, ప్రధానకార్యదర్శిగా తంగళ్లపల్లి వెంకటి, సంయుక్త కార్యదర్శిగా గాజుల రాజ మల్లు, మహిళా ప్రతినిధిగా ఎం. పుష్పలత గెలుపొందారు. మిగతా స్థానాలకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా వేముల నరేశ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా నరిమెట్ల రమేశ్, గ్రంథాలయ కార్యదర్శిగా ఉచ్చిడి శరత్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికా రి సురభి సత్యనారాయణరావు, సహాయ ఎన్నికల అధికారి జగ్గారావు తెలిపారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు నాగం కుమార్, పులి సత్తయ్య, గొట్టే ప్రభాకర్, చింతపంటి రామస్వామి, దూది శ్రీనివాసరెడ్డి, శంకర్, సత్తయ్య, సలీం, బాబు, ముస్లింలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు ఇవ్వాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి - లా, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆర్డీవో రాధాబాయి

సిరిసిల్ల మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైద రాబాద్ నుంచి ఓటరు జాబితా సవరణపై లా అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కమార్ ఝా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గతంలో కంటే ఎన్ని కలను రాబోయే రోజుల్లో మెరుగ్గా నిర్వహించేందుకు అన్నీ వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వాములను చేసేందుకు వినూత్న కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. ఇందు కోసం అవసరమయ్యే సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సిబ్బంది తమ పాత్ర పట్ల విధుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. శాంతిభద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియామావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సరిపడా సిబ్బందిని నియమించాలి

- కార్మికులు, సిబ్బంది ఆందోళన - సూపరింటెండెంట్‌కు వినతిపత్రం



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, సిబ్బంది

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిలో పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. శుక్ర వారం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుత్రి ఎదుట ఆసుపత్రి పారిశుద్య కార్మికులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా రమణ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని పడకలకు అనుగుణంగా శాని టేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బందిని నియమించి పని చేస్తున్న వారికి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 330 పడకలను ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 100 పడకలకు 45 మంది చొప్పున దాదాపు 150 మంది కార్మికులు పని చేయా లని కానీ ఆసుపత్రిలో ప్రస్తుతం 150 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. దీని వల్ల పని చేస్తున్న కార్మికులు, సిబ్బందిపై పని భారం పడుతోందన్నారు. గతంలో కూడా సిబ్బంది, కార్మికులు విధులను బహిష్కరించి నిరసనలు చేపడితే అధికారులు చర్చలు జరిపి 15రోజులలో సిబ్బందిని నియమిస్తా మని హామీనిచ్చారన్నారు. ఇప్పటికి నాలుగు నెలలు గడుస్తున్నా సిబ్బంది నియామకాలు జరగలేదని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెలా 5వ తేదిన వేత నాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పూర్తిస్థాయిలో వేతనాలు అందించా లని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కార్మి కులు, సిబ్బందికి రెస్టు రూం ఏర్పాటు చేయా లని పీఎఫ్, ఈఎస్ఐ, ఐడీ కార్డులు అందజే యాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేపడతామ న్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు బెజుగం సురేష్, ఆసుపత్రి కార్మి కులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న హామీలు గాలికి..
- అభివృద్ధికి ఆమడ దూరంలో మామిడిపల్లి ఆలయం

6



పర్యాటక కేంద్రం నమూనా చూపిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు(ఫైల్)

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ శివారులోని తుమ్మలకుంట వద్ద గల టన్నెల్ సమీపంలో గంజాయి సేవిస్తున్న వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన బండి రాజేశ్(22), కోనరావుపేట మండ లంలోని కొలనూరు గ్రామానికి చెందిన నూగూరి సాయి కృష్ణ(20), వేములవాడ పట్టణంలోని జాత్రా గ్రౌండ్‌కు చెందిన ఎనగందుల పవన్‌చంద్(24)లను శుక్రవారం రాత్రి అరెస్ట్‌చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 107గ్రాముల గంజా యి, ఆరు గంజాయి సిగరేట్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నామని ఆయన తెలిపారు. సిరిసిల్ల పట్టణ శివారులోని తుమ్మలకుంట వద్ద టన్నెల్ సమీపంలో కొంతమంది కలిసి సిగరేట్‌లో గంజాయి పెట్టుకొని తాగుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీలు చేయగా పోలీసులను చూసి కొంతమంది పారిపోగా, ముగ్గురు యువకులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. గంజాయి అక్ర మ రవాణా అవుతున్నందున యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి విక్రయించినా, రవాణా చే సినా, కొనుగోలు చేసి తాగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గోల్ల సత్తయ్య(55) వెన్నునొప్పి భరించలేక గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఉదయ్‌ కుమార్‌ తెలిపినవివరాల ప్రకారం.. సత్తయ్య ఐదు సంవత్సరాల నుంచి తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి11 గంటల సమయంలో ఇంటిముందు ఉన్న 25కిలోవాట్ల విద్యుత్‌ ట్రాన్స్‌ ఫార్మర్‌ వైరును పట్టుకున్నాడు. రెండు చేతులకు తీవ్రమైన గాయాలు కాగా సత్తయ్యను కుటుంబసభ్యులు కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు సత్తయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనం పట్టివేత

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి వద్ద గన్నేరువరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తిమ్మాపూర్‌ మండలం రేణికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్‌28టీ7996గల వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన డ్రైవర్‌ పల్లెచిన్న, వాహన యజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్‌ తెలిపారు.

ఘాట్‌ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- అమలుకు నోచుకోని పర్యాటక కేంద్రం హామీ
- అభివృద్ధికి దూరంగా మామిడిపల్లి సీతారామ ఆలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పనులు ప్రారంభించి వదిలేసిన ఘాట్‌రోడ్డు, మామిడిపల్లి గుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లి సీతారాములస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వహయాంలో మరో భద్రాచలం ఆలయంగా మార్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మాట కలగానే మిగిలిపోయింది. ఘాట్‌ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● ఆలయానికి ప్రత్యేక గుర్తింపు..

కోనరావుపేట మండలం మామిడిపల్లి గుట్టపై వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉండడమే కాకుండా భక్తులు కొంగు బంగారంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య జాతర, సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. వేములవాడ ఆలయ ఆధీనంలో మామిడిపల్లి సీతారాముల ఆలయం కొనసాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో అప్పటి ఎమ్మెల్యే రమేష్‌బాబు మరో భద్రాచలం ఆలయంగా తీర్చిదిద్ద డంతో పాటు పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. సీతమ్మ తల్లి పర్ణశాల నిర్మాణం చేపడుతామన్న హామీ అమలుకు నోచుకోలేదు. మూడు సంవత్సరాల క్రితం కోటి 19లక్షల రూపాయలతో ఘాట్‌ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. సదరు కాంట్రాక్టర్‌ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎలాంటి పనులు జరగడం లేదు. ఇటీవల మాఘమాసం సందర్భంగా ఎమ్మెల్యే సూచన మేరకు రెండు రోజుల పాటు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌ తిరిగి అర్థంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ స్పందించి పనులు పూర్తయ్యేలా, ఆలయ అభివృద్ధి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చాలి..



- కృష్ణహరి, ఆలయ అర్చకులు

గత ప్రభుత్వ పాలనలో మా మిడిపల్లి సీతారామ స్వామి ఆల యాన్ని మరో భద్రాచలం ఆల యంగా మారుస్తారని హామీ ఇ చ్చారు. పర్యాటక కేంద్రంగా మా రితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ప్రారంభించిన ఘాట్‌ రోడ్డు నైనా పూర్తిచేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

రేషన్‌ బియ్యం పట్టివేత



వాహనంలో రేషన్‌ బియ్యం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌ చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్‌ బియ్యం సుమారు 17 క్వింటాళ్లను వ్యాన్‌లో గుండ్లపల్లి మీదుగా సిద్దిపేటకు తరలిస్తుండగా శుక్రవారం గుండ్లపల్లిస్టేజి వద్ద గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల్‌ గ్రామానికి చెందిన వాహన డ్రైవర్‌ బొమ్మ స్వామిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తాండ్ర నరేష్‌ తెలిపారు.

బాలికను వేధించిన కేసులో రెండు సంవత్సరాల జైలుశిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం కోడిమ్యాల పోలీస్‌స్టేషన్‌ పరిధికి చెందిన మహమ్మద్‌ అంకూస్‌ అనే 20సంవత్సరాల యువకుడు 2019 సంవత్సరంలో అదే మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్‌, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్‌, కిరణ్‌, రాజు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అంకూస్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్‌ అధికారులను ఎస్పీ అశోక్‌ కుమార్‌ అభినందించారు.

దొంగను పట్టుకున్న రాజన్న ఆలయ సిబ్బంది

వేములవాడ కల్చరల్‌, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ, మున్సిపల్‌ ప్రాంతాల్లోని విద్యుత్‌ వైర్‌ను దొంగిలిస్తున్న కోరుట్ల ప్రాంతానికిచెందిన శ్రీనివాస్‌ అనేవ్యక్తిని ఆలయ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. తరచూ దేవస్థానానికి చెందిన జనరేటర్‌ సమీపంలో, ఆలయపరిసరాల్లోని విద్యుత్‌వైర్‌ను దొంగిలించి షాపులో అమ్ముతున్నట్లు సిబ్బంది గమనించారు. శుక్ర వారం కూడా వైర్‌ను దొంగిలిస్తుండగా శ్రీనివాస్‌ను పట్టుకొని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్‌ మృతదేహం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చెందిన లింగంపల్లి మొండయ్య బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లగా అక్కడే ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కుటుంబసభ్యులు, గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన తక్షణమే స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేయగా శుక్రవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ, న్యాయవాది లింగంపల్లి నాగరాజు కోరారు.

అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృతి

గంగాధర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపూర్‌ కోళ్లఫారంలో అంతుచిక్కని వ్యాధితో బాయిలర్‌ కోళ్లు మృతిచెందాయి. రెండురోజులుగా కోళ్లు నీరసంగా ఉంటున్నాయి. గురువారం రాత్రి బాగానే ఉన్న కోళ్లు శుక్రవారం ఉదయం మృతిచెందాయి. మృతి చెందిన కోళ్లను పశువైద్యాధికారి పరిశీలించారు. మృతిచెందిన కోళ్లను పూడ్చి పెట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం ఉదయం సీసీఎస్‌ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద రూ. 22,920 నగదు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్టుచేసి వారినికోరుట్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వారివద్ద ఆరుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

● బ్యాంకు నుంచి డ్రాచేసిన రూ. 1.50 లక్షలు అపహరణ



పోలీసులు విడుదల చేసి అనుమానితుల ఫొటో

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శుక్రవారం పట్టపగలు సినీఫక్కీలో చోరీజరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిలాపూర్‌ గ్రామానికి చెందిన చింతకుంట శ్రీహరి అనే రైతు అతని స్నేహితుడితో కలిసి కోరుట్ల పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధానబ్యాంకుకు డబ్బులు డ్రా చేయడానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. బ్యాంకులోకి వెళ్లి రూ. 1,50,000 నగదు డ్రా చేసుకొని ద్విచక్ర వాహనంలో పెట్టుకున్నాడు. అప్పటికే వీరిని గమనిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు శ్రీహరి వాహనం తీస్తున్న సమయంలో మీ జేబునుంచి 100రూపాయలు కింద పడిపోయాయని ఓ వ్యక్తి చూపించాడు. వాహనంపై ఉన్న శ్రీహరి కిందికి దిగి వంద రూపాయల నోటును తీసుకునే క్రమంలో వెనుకాల ఉన్న మరో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో ఉన్న రూ. 1,50,000 నగదును అపహరించి వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారీ అయ్యారు. శ్రీహరి తేరుకొని చూసేసరికి బ్యాగులో ఉన్న నగదు కనపడకపోవడంతో బోరున విలపించాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బ్యాంకుతో పాటు పట్టణంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనుమానితుల సీసీ ఫుటేజీలను పోలీసులు విడుదల చేశారు. బాధితుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

నమిలికొండలో దొంగతనం

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బల్లాడి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 80వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకుపోయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్‌ సందీప్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బల్లాడి లక్ష్మి ఈ నెల 26న కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగింది. ఎవరులేని సమయంలో ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకు పోయారని బాధితురాలు పిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ

శంకరపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చింతగుట్ట గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేస్తూ గణపతి అనే వ్యక్తి అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే పనిచేస్తున్న తోటికూలీలు ఆటోలో తాడికల్‌ వరకు అక్కడినుంచి 108లో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు.

20క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బల్యాలనగర్‌లోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద అక్రమంగా నిల్వచేసిన 20క్వింటాళ్ల రేషన్‌ బియ్యంను శుక్రవారం పట్టుకున్నామని టౌన్‌ సీఐ కె కృష్ణ తెలిపారు. ఈ రేషన్‌ బియ్యంను నిల్వచేసిన కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన బుర్ర అంజయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్‌ రైల్వేగేట్‌ దగ్గర 150గంజాయి అమ్ముతున్న మండలంలో పూడూర్‌ గ్రామానికిచెందిన ఈదురి అనోక్‌పై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌. సందీప్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. రైల్వేగేట్‌దగ్గర అనోక్‌ గంజాయి అమ్ముతున్నాడన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసివెళ్లి అతనిని పట్టుకున్నట్లు తెలిపారు.

నిందితుడిని విచారించగా బీహార్‌కు చెందిన షరీఫ్‌అనేవ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి నట్లు ఒప్పుకున్నాడన్నారు. ఈ మేరకు అనోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొదురుపాకలో చోరీ..

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదురుపాక గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలతోపాటు 24తులాల వెండిని ఎత్తుకెళ్లినట్టు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌ తెలిపారు. గ్రామానికిచెందిన సట్టొజలజ ఇంటికి గడియపెట్టి తాళం వేయకుండా అంగన్‌వాడీపాఠశాలకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటికి తలుపుతెరిచి ఉండడంతో అనుమానంతో బంగారు ఆభరణాలను పరిశీలించగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ సింగరేణి ఉద్యోగి మృతి

పెద్దపల్లి రూరల్‌, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎండి. హైమద్‌ (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బసంత్‌నగర్‌ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న పెద్దపల్లి పట్టణానికి చెందిన గంగిడి శ్రీనివాస్‌ రెడ్డి, హైమద్‌ ద్విచక్రవాహనంపై సింగరేణి లో విధులకు వెళ్తుండగా రాఘవపూర్‌ వద్ద పెద్దపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్‌ అతివేగంతో ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించారు. హైమద్‌ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌ తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జూలేక బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్‌ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం

- మానేరు నది పాత రోడ్డుపై నూతన వంతెన నిర్మాణం
- కరీంనగర్‌- ఎలగందల్‌ మధ్య తగ్గనున్న దూరం

భగత్‌నగర్‌, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌-ఎలగందల్‌ మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెనతో చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, ఎలగందల్‌, కమాన్‌పూర్‌, బావుపేట, ఖాజీపూర్‌ గ్రామాలతో పాటు, సిరిసిల్ల వేములవాడకు వెళ్లే ప్రయాణికులకు దూరం తగ్గనున్నది. ఎల్‌ఎండి నిర్మాణంతో పాత రోడ్డు మానేరులో మునిగి పోవడంతో దశాబ్ధాలకు పైగా ఎలగందల్‌ గ్రామం కరీంనగర్‌ జిల్లా కేంద్రానికి దూరమైపోయింది. కరీంనగర్‌ జిల్లా కేంద్రానికి చెంతనే ఉన్న ఎలగందల్‌ గ్రామానికి చేరుకోవాలంటే పది కిలోమీటర్లకు పైగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరీంనగర్‌-ఎలగందల్‌ గ్రామాల మధ్య మానేరు నదిపై నూతనంగా గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి పునాదులు వేశారు. బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా పూర్తి కావస్తుండడంతోఎలగందల్‌ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరీంనగర్‌-సిరిసిల్ల వెళ్లాలంటే ఈ ప్రాంతంలో పాత రోడ్డు ఉండేది. ఎల్‌ఎండీ నిర్మాణంతో పాత రోడ్డు మానేరు నీటిలో మునిగి పోయింది. బ్యాక్‌ వాటర్‌తో పాటు, మానేరు నది నీరు పూర్తిగా ఈ చింతకుంట, ఎలగందల్‌ గ్రామాలకు ఆనుకుని రావడంతో ఆ రోడ్డు పూర్తిగా కనుమరుగైంది.



ఎలగందల్‌-కరీంనగర్‌ మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి

● పర్యాటకులకు సౌకర్యం

ఎలగందల్‌ గ్రామం ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది. గ్రామంలో ప్రాచీన కళా సంపద, కోట బురుజులు, చారిత్రాక ప్రదేశం కావడంతో బ్రిడ్జి నిర్మాణంతో పర్యాటకుల తాకిడి కూడా పెరగనున్నది. బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ ప్రాంత వాసులు ఏళ్లగా కోరుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావా లని కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ప్రజల వెతలు

- మంద రమేష్‌, మాజీ ఎంపిటీసీ, ఎలగందల్‌



కరీంనగర్‌-ఎలగందల్‌ గ్రామాల మధ్య పాత రోడ్డు ప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. కరీంనగర్‌కు ఎలగందల్‌ గ్రామం దూరం తక్కువైనా బ్రిడ్జి లేక పోవడంతో చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న గ్రామానికి సరైన రవాణా లేక వెనుకబాటుకు గురైంది. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రేమ.. పరువు... హత్య...

- కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న యువతీ, యువకుడు
- పలుమార్లు పంచాయితీ
- కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోతుందని భావించిన తండ్రి
- అదును చూసి యువకుడి హతం
- ముప్పిరితోట గ్రామంలో విషాదం
- శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీస్‌ పికెట్‌



విలపిస్తున్న సాయి కుమార్‌ తల్లి

పెద్దపల్లి/ఎలిగేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమిస్తున్నాడనే అక్కసుతో అమ్మాయి తండ్రి యువకుడి పుట్టిన రోజే పథకంప్రకారం గొడ్డలితో నరికి చంపిన ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో చోటు చేసుకున్నది. పూరేళ్ల పరుశరాములుగౌడ్‌-జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్‌(20) రెండేళ్లక్రితం ఇంటర్మీడియెట్‌లో చేరి మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వీరి ప్రేమవ్యవహారం తెలుసుకున్న అమ్మాయి తండ్రి సాయికుమార్‌ను మందలించాడు. అయినప్పటికీ వారు కలుస్తుండడంతో ఈ విషయమై గ్రామంలో పంచాయితీ జరిగింది. వారు ఒకరికొకరు ఇష్టపడడంతో వివాహం చేయాలని సలహా ఇచ్చారు. ఇరు కుటుంబాలు అందుకు అంగీకరించారు. కానీ కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తండ్రికి ఇష్టం లేదు. మరోవైపు వేరే కులానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేస్తే కులంలో, గ్రామంలో పరువు పోతుందని బంధువులు పేర్కొన్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని అమ్మాయి తండ్రి యువకుడిని హతమార్చేందుకు ప్లాన్‌ వేశాడు.

అమ్మాయిని ప్రేమించిన పాపానికి కసాయి చేతిలో కొడుకు గొడ్డలివేటుకు గురై మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. సాయికుమార్‌ పుట్టిన రోజు గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముత్యం సది(సదయ్య) అనే వ్యక్తి గొడ్డలితో దాడిచేసి విచక్షణరహితంగా నరికి చంపాడు. అదే గ్రామానికి చెందిన యువతి, సాయికుమార్‌ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, పెళ్ళి చేసుకుంటామని తెలిపారని మృతుడి తల్లిదండ్రులు విలపించారు. కొడుకుపై కక్షపెంచుకొని అదనుచూసి చంపాడని బోరున విలపించారు. గతంలో రెండు సార్లు హత్యాయత్నం చేశారని ఆవిషయం కులంలో చర్చించి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మృతుడి తండ్రి పర్శరాలు గౌడ్‌ పేర్కొన్నారు. తమ కుమారుడిని హత్యచేసిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు విలపించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. గతంలో కూతురిని కోల్పోయామని ఉన్న ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురయ్యాడని, తమకు దిక్కెవరంటూ రోదించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ కరుణాకర్‌, ఏసీబీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు సనత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్‌, స్వామి, నరేష్‌కుమార్‌, శ్రావణ్‌కుమార్‌లు పరిశీలించారు. నిందుతుడు ముత్యం సదయ్యపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

గ్రామంలో పోలీస్‌ పికెట్‌

జిల్లాలోనే సంచలనం సృష్టించిన పరువుహత్య ఘటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం రాత్రి పోలీసులు పికెట్‌ ఏర్పాటు చేశారు. ఇరు కుటుంబాల సామాజికవర్గాలు వేర్వేరు కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌ ఉన్నతాధికా రులు ముందస్తు చర్యలు చేపట్టి నిఘాను కట్టుదిట్టం చేశారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు రప్పించి జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్‌, బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్ల ఎస్సైల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన కూడళ్లు, నిందితుడు, మృతుడి ఇంటి వద్ద పోలీస్‌ పహరా ఏర్పాటుచేశారు. పోలీసు పహరా మధ్య శుక్రవారం సాయంత్రం సాయికుమార్‌ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీస్‌ బందోబస్తు మధ్య పోస్టుమార్టం

సుల్తానాబాద్‌, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో హత్యకు గురైన పూరెళ్ల సాయికుమార్‌ మృతదేహానికి శుక్రవారం సుల్తానాబాద్‌ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటన జరిగిన గురువారం రాత్రి నుంచి మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆస్పత్రి వద్ద పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్య సాయికుమార్‌ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సుల్తానాబాద్‌ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్‌ కుమార్‌ పోలీస్‌ అధికారులు బందోబస్తు పర్యవేక్షించారు. మధ్యాహ్నం లోగా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి కావడంతో బందోబస్తు మధ్య మృతదేహాన్ని ముప్పిరితోటకు తరలించారు. మృతుడి బంధువులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతటి అన్నయ్య గౌడ్‌ కు సన్నిహితులు కావడంతో పలువురు నాయకులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

కొబ్బరిముక్కల సేకరణకు టెండర్ ఖరారు

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునే టెండర్ ఎట్టకేలకు ఖరారు అయింది. శుక్రవారం దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, సీల్డ్, బహిరంగ వేలం నిర్వహించగా ఈ వేలంలో హెచ్చు పాటగా రూ.91,16,666 నిలువడంతో టెండర్ ఖరారు చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనిదినాలు 200కు పెంచాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల దృష్ట్యా కూలీల వేతనం కూడా రూ.300 నుంచి రూ.600 పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాల అనుసంధానం పేరిట 7.6 కోట్ల మందికూలీల జాబ్‌కార్డులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. 10 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించాయని తెలిపారు.

పూడూర్‌లో రోడ్డు ప్రమాదం

● వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

కొడిమ్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఆవుల సంపత్‌కు గాయాలయ్యాయి. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుతూ పూడూర్ గ్రామ శివారులో రెండు కార్లను, ఒక లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



వేసవికాలం.. వాహనాలు జాగ్రత్త

ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాల నియంత్రణ

కరీంనగర్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటి వేళ బయట అడుగుపెట్టాలంటే జనాలు భయపడుతున్నారు. భానుడి ప్రతాపంతో మనుషులే కాదు వాహనాలకూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. హైదరాబాద్‌లో బుధవారం ఒక పోలీస్ వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రస్తుత వేసవి కాలంలో వాహనాల్లో ప్రయాణించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనాల్లో ఇంజిన్, విద్యుత్ సరఫరా చేసే వైర్లలో సమస్యలు తలెత్తి మంటలు చెలరేగే అవకాశం ఉంది. వేగంగా వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలను ఢీకొన్న సమయంలో పెట్రోల్, డీజిల్ లీకేజీ అయి మంటలు అంటుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో నడుస్తున్న వాహనం, నిలిపి ఉన్న వాహనాల నుంచే అకస్మాత్తుగా మంటలు వస్తాయి. వాహనాల్లోని వైరింగ్‌లో నాణ్యత లోపం, ఇంజన్ వేడెక్కడం, ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు అంటుకునే ప్రమాదముంది. వేసవిలో పాత వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. వేసవిలో వాహనాల ఇంజన్లు వేడెక్కుతుంటాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాల బారినపడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ (ఈవీ) ద్విచక్ర వాహనాలు, కార్లు వేల సంఖ్యలో నడుస్తున్నాయి. వేసవిలో ఈవీ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు అంటుకునే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈవీ వాహనాలకు చార్జింగ్ చేసే సమయంలో, ఎక్కువ దూరం వెళుతున్న సందర్భంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

వైరింగ్ నాణ్యత లోపంతో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది

- కానిగంటి రమేష్, కార్ మెకానిక్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు



బైక్, కారు, జీపు, ఇతర వాహనాల్లో నాణ్యత లేని వైర్లను ఉపయోగించడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా వాహనాల తయారీ సమయంలో దాని సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా కంపెనీ వైర్ ఫిట్టింగ్ ఉంటుంది. వాహనాల్లో వైరింగ్ దెబ్బతిన్న విషయం గుర్తించకపోవడం, వైర్లు ఒకదానికి మరొకటి కలవడంతో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ గ్యాస్ లీకేజీలు గమనించకుంటే ఎండలకు ఇంజన్ వేడెక్కి హఠాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

● మంటలు వచ్చేందుకు కారణాలు

- వాహనాల్లో వాడుతున్న ఇంధనాలన్నీ ఇంజన్ ఆయిల్, పెట్రోల్, డీజిల్, గ్యాస్ మండే స్వభావం ఉన్నవి.
- వేసవిలో ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది. దూర ప్రయాణంలో మధ్యలో కొంత



సమయం విరామం తీసుకోవాలి.
- ఇంధనాలు ఏమాత్రం లీకైనా వేడికి మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనాల్లో తక్కువ నాణ్యత వైర్లు వాడటంతో కూడా స్పార్క్ వచ్చి మంటలు అంటుకునే ప్రమాదమున్నది.
- వాహనాల్లో ఫాగ్ లైట్స్ స్టీరియో, సౌండ్స్, సెల్‌ఫోన్ చార్జర్, ఇతర డెకోరేషన్ లైట్స్ వంటివి అదనంగా బిగించడంతో వైరింగ్‌పై లోడ్ పడి దెబ్బతింటున్నాయి.
- పాత వాహనాలకు గ్యాస్‌కిట్‌లను అమర్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే లీకేజీ కారణంగా మంటలు అంటుకుంటాయి.
- షోరూం ఎల్పీజీ వర్షన్‌లో వచ్చిన కార్లు కాకుండా పాత కార్లకు తక్కువ నాణ్యత కలిగిన గ్యాస్ కిట్లు అమర్చడంతో గ్యాస్ లీకేజీతో ప్రమాదాలు జరుగుతాయి.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



- ప్రతి కారును నిర్ణీత సమయంలో సర్వీసింగ్ చేయించుకోవాలి.
- 10 వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత వాహనం ఇంజన్‌లో ఉండే ఆయిల్ ఫిల్టర్లను మార్చుకోవాలి.
- కారు నుంచి మంటలు వచ్చినప్పుడు దూరంగా ఉండాలి. అటువైపు ట్రాఫిక్ రాకుండా చూడాలి.
- వాహనంలో ఉన్నప్పుడు మంటలు, కాలుతున్న వాసన వస్తే వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేయాలి.
- మండే స్వభావం ఉన్న గ్యాస్ డబ్బాలు, ఇంధనాలు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- కారు ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్‌ను పోయాలి. ఇది ఇంజన్ వేడెక్కకుండా కాపాడుతుంది.
- తరచు ఇంజన్ ఉష్ణోగ్రతను తనిఖీ చేస్తుండాలి.
- గుర్తింపు పొందిన సెంటర్లలోనే వాహనాలను సర్వీసింగ్ చేయించాలి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రొయ్యల రాజకుమార్(26) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రొయ్యల రాజకుమార్ ఓ దినపత్రికకు రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కాగా గ్రామానికి చెందిన ఒకరి వద్ద రూ.లక్ష అప్పుచేశాడు. అందులో రూ.50వేలు చెల్లించాడు. మద్యం మానేసి మిగతా అప్పుచెల్లించాలని తల్లి కొమురమ్మ రాజకుమార్‌ను మందలించింది. ఈనెల 17న మద్యంలో పురుగులమందు కలుపుకొని తాగి ఇంటికి వచ్చి తల్లికి తెలిపాడు. దీంతో హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

పెంచికలపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం ఉదయం ఎల్కపల్లి పెట్రోల్‌పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరుమండలం మర్తిడి గ్రామంనుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సంతకు తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని సమాచారం మేరకు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కరీంనగర్‌కు చెందిన జాఫర్, అహ్మద్ రఫీ, బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలం అనే ముగ్గురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన కొంతం శ్రావణ్ కమాన్ నుంచి జెండా చౌరస్తాకు బైక్‌పై వెళ్తుండగా మోబైల్ పడిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవికాంత్‌కు అది దొరకగా ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. శ్రావణ్‌కు సెల్‌ఫోన్ అందజేశాడు.

అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ డిపోలో అవగాహన



ఆర్టీసీ డిపో-2లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిదృష్ట్యా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన రక్షణచర్యలపై కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు గురువారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపకఅధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిపోలో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు ఇతర బస్సులున్నాయని, వేసవిలో ఇంజన్ వేడెక్కి మంటలు అంటుకునే ప్రమాదముందని అన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ బస్సులడ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణచర్యలపై అగ్నిమాపకశాఖ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఏఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద విరిగిన హైట్ గేజ్

● మరమ్మతు చేసిన అధికారులు



రైల్వే గేటు వద్ద విగిన హైట్ గేజ్

కరీంనగర్ రూరల్; మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారిపై రైల్వే గేటు వద్ద భారీ చేసిన హైట్ గేజ్ విరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం రెడ్ మిక్స్ వాహనం పైప్పు తాకడంతో విద్యుత్ లైన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైట్ గేజ్‌విరిగింది. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు మరమ్మతు చేపట్టారు. మరమ్మతుచేసే సమయంలో ట్రాఫిక్‌జామ్‌తో అవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి తనిఖీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆస్పత్రిని జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. అనంతరం వేసవిలోలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ బీవీ రావు, జోనల్ వర్క్ షాప్ మేనేజర్ సుగుణాకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎన్.మధుసూదన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులలో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ

● 31675.47 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో తేడా ● అధికారులతో యజమాని వాగ్వాదం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మిల్లు యజమాని

మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లుకు అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో నిల్వలపై సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారంతనిఖీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్‌సీఐ అధికారులు శ్రీలక్ష్మి పారాబాయిల్డ్, రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యంనిల్వ2023-24 సంవత్సరానికిగాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27 క్వింటాళ్ళ ధాన్యంకు గాను 9689.8 క్వింటాళ్ళు మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47 క్వింటాళ్ళ ధాన్యం స్వాహా అయినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ చేస్తున్న అధికారులతో మిల్లు యజమాని వొల్లాల సత్యనారాయణ వాగ్వాదానికి దిగాడు. తనిఖీల పై సివిల్ సప్లై టాస్కుఫోర్సు ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. తనిఖీల్లో 31675.47 క్వింటాళ్ళ ధాన్యం తక్కువగా వచ్చినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 19,339 క్వింటాళ్ల ధాన్యం, బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామని పెద్దపల్లి గోదాం మేనేజర్ వెంకటేష్‌సాగర్ తెలిపారు. నిల్వఉన్న బ్యాగ్‌లు మాత్రం వేరుగా ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. తనిఖీలపై రైస్‌మిల్లు యాజమాని సత్యనారాయణ మాట్లాడుతూ. మిల్లులో 2024 డిసెంబర్ 31 లోగా టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ ధాన్యం నిల్వలు తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ధాన్యం తీసుకెళ్ళక పోవడం వాళ్ళ తప్పే అన్నారు. తనిఖీలో ఎలాంటి తేడాలు వచ్చిన హైకోర్టు ఉత్తర్వుల మేరకు డబ్బులు చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎస్‌ఐ జంగయ్య, డీటీ సంతోష్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు తరలివచ్చి ఆలయకల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు.

అగ్రహారం అంజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ ప్లేస్‌లో ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు నెలల హుండీలను విప్పి లెక్కించగా ఆలయ ఖజానాకు రూ. 2 లక్షల 3 వేల 292 నగదు ఆదాయ సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ఉద్యోగులు వంశీయ ధర్మకర్త మహేందర్, దేవాదాయ శాఖ పరిశీలకుడు రాజమౌళి, సత్యసాయిసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

జయంతి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

● కొండగట్టులో పరిశీలన



కొండపైన అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలోజరిగే హనుమాన్ చిన్నజయంతి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. గతశనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కొండగట్టులో పర్యటించారు. జయంతికి చేపట్టిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు, ఆలయఅర్చకులతో కలిసి కొండపైన ఆలయప్రాంతం, కోనేరు, జైజంక్షన్‌తదితరప్రాంతాలను పరిశీలించారు. కొండపైకివచ్చే భక్తులు, జయంతికి తరలివచ్చే దీక్ష స్వాములు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అడిషనల్‌కలెక్టర్ వెంట ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆర్డీవోమధుసూదన్, స్థానాచార్యులు కపీందర్, దేవస్థానం పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి ఇతర అధికారులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి శివారు వద్ద అక్రమంగా తరలిస్తున్న 12క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అడవి సోమన్‌పల్లి గ్రామానికి చెందిన గొంతినర్సయ్య అనేవ్యక్తి ట్రాలీ ఆటోలో 12క్వింటాళ్ల బియ్యాన్నిఅక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ నర్సయ్యను విచారించగా అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన వేముల మహేష్ చెప్పిన విధంగా మహారాష్ట్రలోని సిర్వోంచకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇంటర్‌లో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలి

● చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి



మాట్లాడుతున్న చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఆర్ట్స్‌విభాగంలో హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం) కోర్సు ప్రవేశపెట్టాల్సిన అవసరముందని చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో చరిత్ర జూనియర్ లెక్చరర్ల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోతరవేణి తిరుపతి హాజరై మాట్లాడారు. 1976 సంవత్సరంలో ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన సాంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగడం శోచనీయమన్నారు. ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా సాంప్రదాయ ఆర్ట్స్ కోర్సులైన హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీతో నూతన కోర్సు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లాచరిత్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొత్తూరి మహేశ్ కుమార్, చరిత్ర జూనియర్ లెక్చరర్లు సుదర్శన్, నరేశ్, రామ్ ప్రసాద్, దేవేందర్, నిర్మల, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ బ్యాగుల తయారీపై విద్యార్థులకు శిక్షణ



పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ.. ప్లాస్టిక్ వినియోగం నివారణలో భాగంగా వ్యర్థ పేపర్లను వినియోగించి పేపర్ బ్యాగులు, పేపర్ ఫైల్ తయారు చేయడంలో ఉపాధ్యయుడు మేడికాల అంజయ్య విద్యార్థులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చాడు. విద్యార్థులు పలు రకాల బ్యాగులు, వివిధ రకాల పత్రాలు భద్రపరచుకోవడానికి పేపర్ ఫైళ్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ బదులుగా పేపర్ బ్యాగ్‌లు, పేపర్ ఫైల్ వాడుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అంజయ్య మాట్లాడుతూ త్వరగా మట్టిలో కలిసిపోయే పేపర్ బ్యాగ్‌లు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, వీటితయారీకి ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే భావితరాలకు కలుష్య రహిత, ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్లాస్టిక్ వలన మనదేశంలో ప్రతి యేటా లక్షలాది మంది క్యాన్సర్ బారినపడుతున్నారని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ బ్యాగ్‌లు,జూట్,బట్టసంచులను వాడాలని పిలుపునిచ్చాడు.

ఈ సందర్భంగా శిక్షణఅందించిన అంజయ్యను ప్రధానోపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు, ఉపాధ్యాయులు జావీద్, మహేశ్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు..

- జయంత్‌కుమార్, తహసీల్దార్, తంగళ్లపల్లి



ఆంధ్రజ్యోతి: మండలంలో ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

తహసీల్దార్: ప్రభుత్వ భూములను గుర్తించి కొన్నిచోట్ల హద్దులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. కొందరు భూములను స్వచ్ఛందంగా తిరిగి ఇస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: స్థానిక అవసరాలకు ఇసుక సరఫరాకు ఎన్నిరోజులు అనుమతిస్తున్నారు?

తహసీల్దార్: వారానికి రెండు రోజులు ఇసుక సరఫరాకు అనుమతి ఇస్తున్నాం. మానేరు నదిలో నీళ్లు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సిరిసిల్ల నుంచి ఇసుక తీయడానికి అనుమతి ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రిజిస్ట్రేషన్లలో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులు తొలిగిపోయాయా?

తహసీల్దార్: సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసినప్పుడు కొంతమేర సాంకేతిక సమస్య తలెత్తింది. సర్వర్ స్లోగా మారి రిజిస్ట్రేషన్లు చేయడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఏమి ఇబ్బందులు లేవు.

- తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న అవేజ్

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని ఏఐసీసీ జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ నియోజక వర్గం కోఆర్డినేటర్ అవేజ్ అన్నారు. శుక్ర వారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాం గ్రెస్ కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలపై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అవేజ్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 39 వార్డులలో పాదయాత్రలు చేస్తూ ప్రజలను చైతన్యపరచాలన్నారు. గడిచిన 18 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎదరుదాడులు చేస్తున్నాయని లేనిపోని అపనిందలు వేస్తున్నాయని ఆరోపించారు. ఎప్పటికప్పుడు వాటిని తిప్పికోట్టాలని అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రతి వార్డుకు టీపీసీసీ అధ్యక్షుడు ఒక కిట్టును పంపిస్తారని అందులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటం, కాంగ్రెస్ పార్టీ జెండా, రాజ్యాంగ పుస్తకం ఉంటుందన్నారు. ప్రతి వార్డులో అంబేద్కర్ చిత్రపటం ఉంచి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి పాదయాత్రలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథాకాలను వివరించాలని సూచించారు. పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణకో ఆర్డినేటర్ నామల ఉమ, బ్లాక్ కాంగ్రెస్ సిరిసిల్ల అధ్యక్షుడు సూర దేవ రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాల రాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంగళ అశోక్, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మాజీ కౌన్సిలర్లు మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, కుడికాల రవికుమార్, కత్తెర దేవదాస్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పీసీసీ జిల్లా కోఆర్డినేటర్ మహమ్మద్ అవేజ్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల సమావేశంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం నర్సయ్య, కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, చందనగిరి గోపాల్, చేపూరి గంగాదర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, గొట్టే రుక్మిణి, వెంగలి వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, కేబాల్ రెడ్డి, మానుక సత్యం, బాదనేని బాలరాజు, రామచంద్రం పాల్గొన్నారు.

● గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట),మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి ఉండి ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిందని ఏఐసీసీ కో-ఆర్డినేటర్ అవేద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణలు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ అధ్యక్షతన శుక్ర వారం జరిగింది. ముఖ్యఅతిథులుగా మండల కో-ఆర్డినేటర్ వెంకటస్వామి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ, వైస్ చైర్మన్ అంజిరెడ్డిలతో కలిసి వారు హాజరయ్యారు. సమావేశంలో నాయకులు తిరుపతి, రామచంద్రారెడ్డి, హన్మండ్లు, సురేశ్, అంజిరెడ్డి, పర్శరాములు, బాలయ్య, భూమరాజం, స్వామి, రాజశేఖర్, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..



ఎనగల్ శివారులో కూలిన కల్వర్టు

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎనగల్ గ్రామ శివారులో గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. అధికారులు నాయకులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వేములవాడ నుంచి ఎనగల్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలి..

- కుటుంబ జనార్దన్, మాజీ ఉపసర్పంచ్, ఎనగల్



ఎనగల్ నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినప్పుడు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోక ముందే అధికారులు కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టాలి.

ఇరుకు బ్రిడ్జితో ఇబ్బందులు



నిమ్మపల్లి-మరిమడ్ల మధ్యలో ఉన్న ఇరుకు బ్రిడ్జి

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి ఇప్పుడు ఇరుకుగా మారింది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మరిమడ్ల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు నీరు వెళ్లే ప్రాంతంలో 30ఏళ్ల క్రితం బ్రిడ్జిని నిర్మించారు. ఇప్పుడు బ్రిడ్జి వాహనదారులకు ఇరుకుగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గతంలోకన్నా వాహనాల రాకపోకలు పెరగడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఒక వాహనం వెళ్లే వరకు రోడ్డు పక్కకు వాహనాలను ఆపు కోవాల్సి వస్తోంది. అలాగే బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరుచేసి ఇరుకుగాఉన్న బ్రిడ్జి స్థానంలో పెద్ద బ్రిడ్జి నిర్మించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి నిధులు మంజూ రుకు కృషి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కించగా రు 4 లక్షల 64 వేల 177 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో మారుతిరావు, ప్రభాకర్‌రావు రాజేందర్‌తో పాటు బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



భూమి పూజ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం తదితరులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లో రూ.35 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన సీసీ రహదారుల నిర్మాణాలకు శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి రహదారులు ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, బుచ్చాగౌడ్, మహేందర్, నరేందర్, శ్రీనివాస్, దేవేందర్, బాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో వరి కోతలు షురూ

ఎల్లారెడ్డిపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, గుండారం, తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు వరి కోతల్లో నిమగ్నమయ్యారు. హార్వేస్టర్లతో వరి పంటను కోయించి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. ధాన్యం ఆరబెడుతున్నారు. వరి ధాన్యం చేరడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఇల్లంకుంట, మార్చి 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని కందికట్కూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో వివరాలు తెలుసుకున్నారు. పొత్తూరు గ్రామంలోని బ్యాంకుకు శుక్రవారం విద్యార్థులు రాగా బ్యాంకు సిబ్బంది లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు ఎలా తెరువాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు జీరో అకౌంట్ క్రింద ఖాతాలు ఇచ్చారు. కార్యక్రమంలో బ్యాంకుమేనేజర్ లింగంపల్లి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజులతో పాటు బ్యాంకుసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపాకలో ఇఫ్తార్ విందు

ఇల్లంతకుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలోని జామామసీదులో మండల నూర్‌భాషా సంఘ అధ్యక్షుడు మహమ్మద్ సలావొద్దీన్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్, ముంషాద్, అలీం, షాబీర్, సాదిక్, కుర్షిద్, మున్నా, రెహాన్, ఆఫ్రిది, అహద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, దుమాల గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, రమేశ్, శ్రీనివాస్, ప్రకాశ్, దేవరెడ్డి, బాలయ్య, నారాయణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'ఒక దేశం-ఒక ఎన్నిక'కు సహకరించాలి

వేములవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఒక దేశం ఒక ఎన్నిక కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని బీజేపీ నాయకురాలు డాక్టర్ చెన్నమనేని దీప అన్నారు. శుక్రవారం వేములవాడలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక దేశం ఒక ఎన్నిక అమలుచేయడం ద్వారా ఎన్నికల ఖర్చులు భారీగా తగ్గించుకోవచ్చన్నారు.జిల్లామహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన జొన్నకంటి తేజశ్రీ శుక్రవారం బీజేపీలో చేరారు. వేములవాడలో నిర్వహించిన సమావేశంలో చెన్నమనేనీ దీప ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి హరిష, ఉపాధ్యక్షురాలు మాధవి, రజిత, జ్యోతి, లహరి, మండల అధ్యక్షురాలు పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

వేములవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వేములవాడలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. బి విజయ్‌కుమార్, పి రవి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. సంఘం అనుబంధ వేముల వాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా టి కరుణాకర్, కార్యదర్శిగా ఎస్ నరేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యుట్యూబర్‌పై దాడిని ఖండించిన ఐటీఎఫ్

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఈనెల 26న రాత్రి యూట్యూబ్ ఛానల్ మహిళా నటులపై జరిగిన దాడిని ఇండస్ట్రీస్ తెలంగాణ ఫోక్(ఐటీఎఫ్) ఖండిస్తున్నామని సంఘం కళాకారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా కళాకారులను దుర్భాషలాడుతూ అకారణంగా దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామని, ఇది యావత్ మహిళా లోకానికి అవమానకరమన్నారు. పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు.

రైతులు, సంఘ సభ్యుల అభ్యున్నతికి కృషి

- ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట సహకార సంఘం రూ.30కోట్ల ఆదాయంతో అభివృద్ధి పథంలో కొనసాగుతోందని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సభ్యులు, రైతుల అభ్యున్నతికి సంఘం పాటుపడుతోందన్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు సహకారంతో రైతులకు దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను అందించామని అన్నారు. ఆదాయ, వ్యయాలకు సంబంధించిన నివేదికలను వెల్లడించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ సత్తయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు నర్సయ్య, సతీష్, ఎల్లయ్య, వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

కోర్ బోలి భాషకు ప్రభుత్వ ఆమోదంపై సంబరాలు

- సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



కోనరావుపేటలో హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజన నాయకులు

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కోర్ బోలి (లంబాడి) భాషకు శాసనసభలో ఏకగ్రీవంగా అధికార భాషగా ఆమోదించడం పట్ల కోనరావుపేట మండల గిరిజనులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు బానోతు నరేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం లంబాడి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. దేశంలో 700 భాషలు ఉన్నప్పటికీ 22 భాషలు మాత్రమే ప్రభుత్వం ఆమోదం చేసిందని అన్నారు. మంత్రి కిషన్ రెడ్డి కేంద్రంలో గిరిజన భాషను ఆమోదింపజేసే విధంగా సహకరించాలని కోరుతున్నామని అన్నారు. సందర్భంగా గిరిజన నాయకులు రాజు నాయక్, కిషన్ నాయక్, పంతులు నాయక్, ప్రకాష్ నాయక్, భాస్కర్, తిరుపతి, రమేష్, మదన్ నాయక్, మోహన్, అమృత లాల్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరీలాల్‌నాయక్, ఆల్ ఇండియా బంజార సంఘం అఖిల పక్షం జిల్లా నాయకులు బానోతు రాజు నాయక్ అధ్వర్యంలో శుక్రవారం గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్లో చేర్చి అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు టపాసులు కాల్చి సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 75 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన భాషకు ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు గజన్‌లాల్, రాజు, మదన్‌నాయక్, ప్రకాష్‌నాయక్, అఖిల పక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో అఖిలపక్షం నాయకుల సంబరాలు..

ట్యాంకును శుభ్రం చేయించాలి



ట్యాంకు చుట్టూ ఉన్న నాచు

ఎల్లారెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని బీసీ కాలనీలోని ట్యాంకు నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడం వల్ల నాచు పేరుకుపోయింది. ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. అందులోనే నిలబడి కాలనీవాసులు నీటిని పట్టుకోవాల్సి వస్తోంది. ట్యాంకును శుభ్రం చేయకపోవడం వల్ల నీటిలో నాచు, పురుగులు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్యాంకును శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ మహేష్ బి గీతే - రుద్రంగి పోలీస్ స్టేషన్ తనిఖీ



చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మహేష్ బి గీతే

రుద్రంగి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. శుక్రవారం రుద్రంగి పోలీస్ స్టేషన్లతో పాటు రుద్రంగి-మానాల చెక్‌పోస్ట్‌ను ఆయన సందర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ల పరిసరాలు, సిబ్బంది పనితీరు, సర్కిల్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేయాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ వల్ల కలిగే అనర్థాలతో పాటు ఇతర అంశాల మీద అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నివారణకు ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వాహనల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ పెట్రోలింగ్ ముమ్మరం చేయాల సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అశోక్, అంజయ్య, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కార్మిక సంఘాల నాయకుల సమ్మె నోటీస్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ చీరలను తయరు చేసే కార్మికులకు కూలి నిర్ణయించకపోవడం అన్యాయమని ఇందిరమ్మ చీరలకు పవర్‌లూం, వార్పిన్, వైపని అనుబంధ రంగాల కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా కూలీ పెంచి నిర్ణయించాలని లేకుంటే ఏప్రిల్ 1 వతేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణలు ప్రకటించారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి సమ్మె నోటీస్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లలో గత సంవత్సరంకాలంగా పవర్‌లూం వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభం ప్రభుత్వం కార్మికులకు ఉపాధితోపాటు మెరుగైన వేతనాలు అందించాలన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్చలు జరిపి చీరల వస్త్రానికి కూలి పెంచాలని లేకుంటే ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు.



ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న కోడం రమణ

ఈ కార్యక్రమంలో వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరమల్లె సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, బూట్ల వెంకటేశ్వర్లు, ఎలిగేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెస్ కార్యాలయం ఎదుట గ్రామస్థుల ఆందోళన

- అధిక బకాయిల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత



సెస్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న అడవిపదిర గ్రామస్థులు

వీర్నపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం అడవిపదిరలో వినియోగదారుల బకాయిలు అధికంగా ఉండడంతో సెస్ అధికారులు కరెంట్ కనెక్షన్‌ను నిలిపివేశారు. దీంతో గ్రామ ప్రజలు సెస్ ఆఫీస్ ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్, జాలపెల్లి మనోజ్ కుమార్ మాట్లాడుతూ అడవిపదిర గ్రామంలో అధిక బకాయిలు చెల్లించమని కరెంట్ కనెక్షన్ కట్ చేయడాన్ని ఖండించారు. గతంలో ఒక సెస్ అధికారి నిర్లక్ష్యం వల్ల ఎక్కువ బకాయిలు పెరిగిపోయి వినియోగదారులకు భారంగా మారిందన్నారు. దీంతో వేలాది రూపాయిల బకాయిలు కట్టలేని పరిస్థితిలో బాధితులు ఉండడంతో సంబంధిత ఉద్యోగిని గతంలో సస్పెండ్ చేశారని తెలిపారు. గతంలో ఈ సమస్యను పరిష్కారిస్తామన్న హామీని అధికారులు మరిచారని, సమస్యను పరిష్కరించకుండానే అధికారులు కరెంట్ కనెక్షన్ కట్ చేయడం సరికాదన్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఇదే సమస్య ఉందని వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేయగా సమస్యను పరిష్కారిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాజవ్వ,పద్మ, దేవవ్వ, పూర్ణిమ, వనిత, ఎల్లవ్వ, పుష్ప, మంజుల, రాజవ్వ ప్రకాష్, క్రాంతి, జాషువా, కార్తీక్, మనోభిషేక్, విష్ణు, రాబిన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్, రిఫ్రిజిరేటర్ బహూకరణ

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం పెద్దూర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు శ్రీవాణి నర్సింగ్ హోమ్ వైద్యులు రమణారావు, శ్రీవాణి దంపతులు ఆర్వో ప్లాంట్, రిఫ్రిజరేటర్‌ను బహుమతిగా ఇవ్వగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ బైరీ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమానికి వైద్యులు స్వాతి, అన్వర్ ఉన్నిస నబ్రి, అలీమ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.